- మోదీజీ.. ఇది కుటుంబ పాలనా కాదా?

ఓటమిని అంగీకరించిన కాంగ్రెస్

- దేశంలో ఎన్డీయే కూటమిదే విజయం
- రాజమండ్రి పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): దేశంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న అన్ని రాష్ట్రాల్లో ఎన్డీయే కూటమే విజయం సాధిస్తుందని, కాంగ్రెస్ ఇప్పటికే ఓటమిని అంగీకరించిందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఎద్దేవా చేశారు. ఎన్డీయే కూటమి తరుపున ప్రధాని మోదీ రాజమండ్రిలోని వేమగిరిలో భారీ బహిరంగసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. మే 13న ఏపీ రాజకీయాల్లో సరికొత్త అధ్యాయం మొదలవుతుందని చెప్పారు. వైసీపీ పాలనలో ఏపీ అప్పుల్లో కూరుకుపోయిందని విమర్శించారు. ఐదేళ్లలో ఏపీలో ఇసుక మాఫియా, లిక్కర్ మాఫియా నడుస్తుందని ఆరోపించారు. వైసీపీకి ఆర్థిక క్రమశిక్షణ లేదన్నారు. మూడు రాజధానులు ఏర్పాటు చేస్తామన్న వైసీపీ.. ఐదేళ్లలో ఒక్క రాజధాని కూడా ఏర్పాటు చేయలేదని తప్పుబట్టారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏపీ అభివృద్ధి అనే పట్టాలపై పరిగెత్తిందన్న మోదీ.. వైసీపీ హయాంలో ఏపీలో అభివృద్ధి పట్టాలు తప్పిందని విమర్శించారు.

పెద్దపల్లిలో జరిగిన జనసభలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా

సభలో నుంచి వెళ్లిపోవద్దు ప్లీజ్

బౌన్సర్లను ఏర్పాటు చేసి ప్రజలను అడ్డుకున్న బీజేపీ శ్రేణులు

పెద్దపల్లి, మే 6 (నమస్తే తెలంగాణ)/నీలగిరి/నల్లగొండ రూరల్/చౌటుప్పల్ : నల్లగొండలో బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డికి మద్దతుగా సోమవారం సాయంత్రం ఆ పార్టీ ఎన్నికల ప్రచారం నిర్వహించింది. స్థానిక మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన బహిరంగ సభలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా పాల్గొన్నారు. ఈ సభకు 3 వేల నుంచి 4 వేల మందికి మించి రాలేదు. దీంతో సభకు వచ్చిన వారు బయటకు వెళ్లిపోకుండా బీజేపీ కార్యకర్తలు బౌన్సర్లను ఏర్పాటు చేసి అడ్డుకున్నారు. చౌటుప్పల్‌లోని తంగడపల్లి సభ, పెద్దపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలోని సభలో కూడా జనం లేక కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి.

- ‘గల్ఫ్ కార్మిక ద్రోహి.. గప్పాల అరవింద్: ఎన్నారై సెల్

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): బీజేపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్ గత ఎన్నికల్లో మాయమాటలు చెప్పి గల్ఫ్ కార్మికులను మోసం చేసి నిజామాబాద్ నుంచి ఎంపీగా గెలిచారని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎన్నారై సెల్ నాయకులు ఆరోపించారు. ఈసారి ఎన్నికల్లో మళ్లీ మోసపోవద్దని ఓటర్లను అప్రమత్తం చేస్తూ ‘గల్ఫ్ కార్మిక ద్రోహి.. గప్పాల అరవింద్‘ అంటూ సోమవారం గాంధీభవన్‌లో చార్జిషీట్‌ను విడుదల చేశారు. కాంగ్రెస్ రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి, టీపీసీసీ ఎన్నారై సెల్ నాయకులు మందభీంరెడ్డి, నంగి దేవేందర్‌రెడ్డి, కేరళ ప్రవాసీ కాంగ్రెస్ నేత మునీర్ చార్జిషీట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చార్జిషీట్‌లో తాము చేసిన అభియోగాలకు సమాధానం చెప్పకుండా.. గల్ఫ్ కార్మికుల ఓట్లు అడిగే నైతిక అర్హత అరవింద్‌కు లేదని గుర్తు చేశారు.

అరవింద్‌పై చార్జిషీట్‌లో అభియోగాలు ఇలా ఉన్నాయి

- 2020 సెప్టెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల పొట్టగొడుతూ.. కనీస వేతనాలను 30 నుంచి 50 శాతం వరకు తగ్గిస్తూ సర్క్యులర్లు జారీ చేసినప్పుడు కేంద్ర ప్రభుత్వానికి కనీసం వినతిపత్రం కూడా ఇవ్వడం చేతకాని అసమర్థుడు అరవింద్.
- ‘ప్రవాసీ భారతీయ బీమా యోజన’లో సహజ మరణాన్ని చేర్చాలని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లకుండా తప్పించుకు తిరిగిన ’గల్ఫ్ ద్రోహి’ అరవింద్.
- హైదరాబాద్‌లో సౌదీ అరేబియా, కువైట్ దేశాల కాన్సులేట్‌ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వానికి కనీసం లేఖ కూడా రాయటం చేతకాని అజ్ఞాని అరవింద్.
- కరోనా కష్టకాలంలో.. గల్ఫ్ దేశాల నుంచి ఇండియాకు వచ్చిన పేద కార్మికుల రక్తం పిండి రెండింతలు, మూడింతలు విమాన చార్జీలు వసూలు చేసింది బీజేపీ ప్రభుత్వం. ఉచితంగా దేశానికి తీసుకురావాల్సిన కేంద్రం.. అధిక చార్జీలు వసూలు చేయడాన్ని ప్రశ్నించలేని అసమర్థ అరవింద్ ఎంపీ పదవికి అనర్హుడు.

- ఏ అధికారంతో ఢిల్లీ పోలీసులు వచ్చారు?: రేణుకాచౌదరి

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): ఏ అధికారంతో ఢిల్లీ పోలీసులు తెలంగాణలో దిగారు? ఏ హక్కుతో గాంధీభవన్‌కు వచ్చి మా వాళ్లపై కేసులు పెడుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వానికి దమ్ముంటే ప్రజ్వల్ రేవణ్ణను పట్టుకోవాలని సవాల్ విసిరారు. సోమవారం ఆమె గాంధీభవన్‌లో మాట్లాడుతూ.. నీరవ్‌మోదీ, చోక్సీ పారిపోయినట్టే, ప్రజ్వల్ కూడా విదేశాలకు పారిపోవడానికి అవకాశం కల్పించింది ఎవరని ప్రశ్నించారు. ప్రజ్వల్‌ను బలపరిస్తే తనను బలపరిచినట్టేనని మోదీ సిగ్గు లేకుండా మాట్లాడారని మండిపడ్డారు.

- రేవంత్ లక్కీ డిప్ సీఎం: డీకే అరుణ

మహబూబ్‌నగర్ అర్బన్, మే 6: ‘రేవంత్‌రెడ్డి లక్కీ డిప్ ముఖ్యమంత్రి. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన దొంగ. బూతులు మాట్లాడే సీఎం మన జిల్లా వాసి అంటే సిగ్గుగా ఉంది. మోదీని తిట్టడం అంటే ఆకాశం మీద ఉమ్మేసినట్టే’ అంటూ బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ మండిపడ్డారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఆమె మీడియాతో మాట్లాడారు. దమ్ముంటే పాలమూరుకు జూరాల నుంచి నీళ్లు తీసుకొచ్చేలా అనుమతులు ఇప్పించని సవాల్ విసిరారు.

- రేవంత్‌రెడ్డిపై బీజేపీ నాయకుల ఫిర్యాదు

కొత్తగూడెం క్రైం, మే 6: కేంద్రమంత్రి అమిత్‌షాపై సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేశారని బీజేపీ నాయకులు సోమవారం కొత్తగూడెం వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎం కరుణాకర్‌కు ఫిర్యాదు చేశారు. ‘బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తారని.. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు రద్దు చేస్తారని’ కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా అన్నట్టు ఈ నెల 4న కొత్తగూడెం కాంగ్రెస్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేసినట్టు తెలిపారు.

- ఢిల్లీ కంటే ముందే షా వీడియో మార్ఫింగ్ కేసు

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 6 (నమస్తే తెలంగాణ): కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వీడియో మార్ఫింగ్ కేసు ఢిల్లీ కంటే ముందే హైదరాబాద్‌లో నమోదైందని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ఒకే నేరంపై రెండు చోట్ల కేసులు అవసరం లేదని, ఇద్దరు దర్యాప్తు చేస్తే గందరగోళానికి కారణం అవుతుందని అభిప్రాయపడ్డారు. సీసీఎస్‌లో సోమవారం మీడియా సమావేశంలో ఈ కేసు గురించి ఆయన మాట్లాడుతూ.. ఐటీ యాక్ట్ కావడంతో దేశంలో ఎక్కడైనా కేసు నమోదు చేయవచ్చని, అయితే ఒకే నేరంపై రెండు చోట్ల కేసులు అనవసరమని ఇటీవల ఢిల్లీ స్పెషల్ డీసీపీ వచ్చి తనను కలిసినప్పుడు చెప్పానని వెల్లడించారు. డీసీపీ అడిగిన వివరాలు కూడా అందించామని చెప్పారు. గత నెల 26న బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారని, ఫిర్యాదుతోపాటు వీడియో కావాలని కోరామని తెలిపారు. మరుసటి రోజు పెన్‌డ్రైవ్‌లో తెచ్చి ఇవ్వడంతో కేసు నమోదు చేశామని తెలిపారు. ఎక్స్(ట్విట్టర్)ను సంప్రదించి వివరాలు కోరగా 72 గంటల్లో ఇస్తామన్నారని, ఆ తరువాత మరికొంత సమయం పట్టిందని, ట్విట్టర్‌కు లెటర్ రాసి ఎక్కడి నుంచి అది పోస్ట్ అయ్యిందో గుర్తించి ఐదుగురిని అరెస్టు చేశామని పేర్కొన్నారు.

- ఆ వైద్యుల వివరాలివ్వండి

కోడ్ ఉల్లంఘనపై కలెక్టర్ సీరియస్ • నమస్తే తెలంగాణ కథనానికి స్పందన

నిజామాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వైద్యాధికారుల తీరుపై నిజామాబాద్ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాజీవ్‌గాంధీ హనుమంతు సీరియసయ్యారు. ప్రభుత్వ వైద్యుల కోడ్ ఉల్లంఘన శీర్షికన ‘నమస్తే తెలంగాణ’లో వచ్చిన వార్తపై ఆయన సోమవారం స్పందించారు. నివేదిక సమర్పించాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి సుదర్శనం, ప్రభుత్వ జనరల్ దవాఖాన సూపరింటెండెంట్ ప్రతిమారాజ్‌ను ఆదేశించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ విభాగం ఉన్నతాధికారులు సైతం లెటర్ పంపినట్టు సమాచారం. నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి.



సిద్దిపేటలో జిల్లా ములుగు రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, హరీశ్‌రావు. చిత్రంలో మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు, ములుగు రోడ్‌షోకు హాజరైన జనం

కేసీఆర్‌ను తిడితే తెలంగాణను తిట్టినట్టే

- కాంగ్రెస్ మోసం.. నాలుగు నెలలకే తెలంగాణ ఆగం
- గ్యారెంటీలు అమలైన గ్రామాల్లో మేం ఓట్లు అడగం
- అమలుకాని గ్రామాల్లో హస్తం పార్టీ ఓట్లు అడగొద్దు
- కేసీఆర్ దెబ్బకు రైతుబంధు, పంటనష్టం పైసలిస్తున్నరు
- రాష్ట్రంలో హీట్ వేవ్.. బీఆర్ఎస్ వేవ్ నడుస్తున్నయ్
- రేవంత్ ఐదు అంటే.. రాహుల్ ఆరు అంటుండు
- కాంగ్రెస్‌కు రేవంత్‌తో అపాయం పొంచి ఉన్నది
- కాంగ్రెస్, బీజేపీ అబద్ధాలకు పుట్టిన కవలలు: హరీశ్

గజ్వేల్, నర్సాపూర్, మే 6: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను తిడితే, తెలంగాణను తిట్టినట్టేనని మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. సోమవారం మెదక్ జిల్లా నర్సాపూర్‌లో మీడియాతో, బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా సిద్దిపేట జిల్లా ములుగు, కుకునూర్‌పల్లి, కొండపాకలో రోడ్‌షోల్లో పాల్గొని మాట్లాడారు. ‘తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌ను తిట్టడం రేవంత్‌రెడ్డికి మంచిదా? కేసీఆర్ వయసెంత? నీ వయసెంత? కేసీఆర్ లేకుంటే నువ్వు సీఎం అయ్యేవాడివా? ఆంధ్రా నాయకుల అడుగులకు మడుగులు ఒత్తే నువ్వు బీఆర్ఎస్‌ను విమర్శించటమా?’ అని రేవంత్‌పై ధ్వజమెత్తారు. మెదక్ జిల్లా కీర్తిని ఆకాశానికి ఎత్తిన కేసీఆర్‌ను తిట్టడం సరికాదని, పరిపాలనా సౌలభ్యం కోసం కొత్త జిల్లాలను కేసీఆర్ ఏర్పాటు చేస్తే, ఆ జిల్లాలను రద్దు చేస్తామనటం ఎంతవరకు సమంజసం? అని ప్రశ్నించారు. జిల్లాల రద్దును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు రైతుబంధు ఇస్తావా? చస్తావా? అని కేసీఆర్ బస్ వేసుకొని తిరుగుతూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే దెబ్బకు ఇప్పుడు రైతుబంధు వేస్తున్నరని, పంట నష్టం ఇస్తున్నరని వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుతం రెండు వేవ్‌లు నడుస్తున్నాయని, ఒకటి హీట్ వేవ్ కాగా.. మరోటి బీఆర్ఎస్ వేవ్ అని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ విజయం ఖాయమైపోయిందని ధీమా వ్యక్తం చేశారు. మట్టి పనికైనా, ఇంటి పనికైనా మనోడు ఉండాలని, అందుకు మనకు కేసీఆర్ రక్ష అని అన్నారు.

నాలుగు నెలలకే తెలంగాణ ఆగం

మాయమాటలతో గద్దెనెక్కిన కాంగ్రెస్.. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవెర్చకుండా మోసం చేసిందని, నాలుగు నెలల్లోనే తెలంగాణను ఆగం చేసిందని హరీశ్ ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ఐదు హామీలు అమలు చేశామంటే, రాహుల్‌గాంధీ ఆరు చేశామంటూ ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలను అమలు చేశామని రాహుల్‌గాంధీ ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచారంలో చెప్పారని, ఏ గ్రామంలో అమలైందో చెప్పాలని ప్రశ్నించారు. ఏ గ్రామంలో అయినా ఆరు గ్యారెంటీలు అమలైతే బీఆర్ఎస్ ఓట్లు అడగదని, ఆరు గ్యారెంటీలు అమలుకాని ఊళ్లలో కాంగ్రెస్ ఓట్లు అడగవద్దని సవాల్ విసిరారు. రాష్ట్రంలో ప్రజలకిచ్చిన హామీలను ఎక్కడ అమలు చేశారో రాహుల్ గాంధీ చూపించాలని డిమాండ్ చేశారు. హస్తం పార్టీ రాకతో దొంగ కరెంట్ మొదలైందని, ఆ పార్టీ వచ్చుడేమో కానీ ఉన్న కల్యాణ లక్ష్మి రావటం లేదని, తులం బంగారం లేదని, చూస్తుంటే బంగారం ధర కొండెక్కిందని విమర్శించారు. ఈ గవర్నమెంట్ అంతా రివర్స్ గేర్‌లా ఉన్నదని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ తప్పుచేస్తే రాహుల్ సరిదిద్దాలని, రాహులే తప్పు చేస్తే ఎవరు సరిదిద్దుతారని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీకి రేవంత్‌రెడ్డితో అపాయం పొంచి ఉన్నదని వ్యాఖ్యానించారు. ఈ తప్పులను సరిదిద్దే బాధ్యత తెలంగాణ ఓటర్లపై ఉన్నదని, కేసీఆర్ నిలబెట్టిన వెంకట్రామిరెడ్డిని గెలిపించుకొందామని పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్‌పై కాంగ్రెస్, బీజేపీ అబద్ధాలు

బీఆర్ఎస్‌పై కాంగ్రెస్, బీజేపీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయని, ఆ పార్టీలు అబద్ధాలకు పుట్టిన కవల పిల్లలు అని హరీశ్ మండిపడ్డారు. హామీలు నెరవేర్చకుండా సెంటిమెంట్ రగిలించే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. పదేండ్లలో బీజేపీ, ఐదు నెలల్లో కాంగ్రెస్ ప్రజలకు ఏం చేశాయే చెప్పలేక పోతున్నాయని, అందుకే మతాలు, రాజ్యాంగం, రిజర్వేషన్లు అంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని దుయ్యబట్టారు. ఓవైపు ఎండలు మండుతుంటే, మరోవైపు కాంగ్రెస్, బీజేపీ మోసపూరిత మాటలతో ప్రజల గుండెలు మండుతున్నాయని వెల్లడించారు. ఎన్నికల కోసం బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు బీఆర్ఎస్ అభ్యర్థిపై సోషల్ మీడియాలో గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీకి ఓటు వేస్తే పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్టేనని అన్నారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మన్సూర్, మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, మాదాసు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు గోపి, సత్యంగౌడ్, వెంకట్‌రెడ్డి, శివకుమార్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పులు ఎక్కడ?

- 90 శాతం వరకు పంపిణీ జరిగిందంటున్న ఈసీ
- తమకింతవరకూ అందలేదంటూ ఓటర్ల ఫిర్యాదు
- హెల్ప్‌లైన్ యాప్ ద్వారా డౌన్‌లోడ్‌కూ అవకాశం

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఓటరు స్లిప్పుల పంపిణీలో ఎన్నికల అధికారులు చెప్తున్న లెక్కలకు క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతన కుదరడం లేదు. ఇప్పటికే 90 శాతానికి పైగా ఓటరు స్లిప్పుల పంపిణీ జరిగినట్టు అధికారులు చెప్తుండగా.. అనేక ప్రాంతాలు, గ్రామాల్లో నేటి వరకు కూడా అందలేదని ఓటర్లు ఫిర్యాదు చేస్తున్నారు. రాష్ట్రంలో 3.32 కోట్ల మంది ఓటర్లుండగా ఇప్పటికే మూడు కోట్ల స్లిప్పుల పంపిణీ జరిగిందని లెక్కలు చెప్తున్నారు. ఈనెల 4నాటికే జీహెచ్ఎంసీ పరిధిలోని చేవెళ్ల లోక్‌సభ పరిధిలో 90 శాతం, మల్కాజిగిరి, సికింద్రాబాద్‌లో 80 శాతం, హైదరాబాద్‌లో 79 శాతం ఓటరు స్లిప్పులు పంపిణీ చేసినట్టు చెబుతున్నారు. కానీ వీటిలో సగం మంది ఇండ్లకు కూడా ఓటరు స్లిప్పులు రాలేదని ఫిర్యాదులు వస్తున్నాయి. నగరాలు, పట్టణాల్లో మున్సిపల్ సిబ్బంది, బీఎల్‌వోల ఆధ్వర్యంలో, గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీరాజ్, రెవెన్యూ సిబ్బంది ఓటరు స్లిప్పుల పంపిణీ చేసే బాధ్యతను అప్పగిస్తారు. పోలింగ్ తేదీకి ఐదు రోజుల ముందుగానే ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలని ఎన్నికల కమిషన్ అధికారులు ఆదేశించారు.

ఇలా డౌన్‌లోడ్ చేసుకోండి

ఓటరు స్లిప్పులు పంపిణీ కాకపోవడంతో ఇతర మార్గాల్లో వాటిని ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలనే దానిపై ఓటర్లు దృష్టి పెడుతున్నారు. సాంకేతికంగా కొంత అవగాహన ఉన్న వారు ఓటరు హెల్ప్‌లైన్ యాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొనే వెసులుబాటు ఉంది. గుగూల్ ప్లేస్టోర్‌లో ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఓటరు సర్వీసెస్ ఆప్షన్ క్లిక్ చేసి, ఆపై సెర్చ్ ఆప్షన్ మీద క్లిక్ చేయాల్సి ఉంటుంది. అక్కడ మీ మొబైల్ నెంబర్, ఓటరు కార్డు నంబర్, ఓటరు వివరాలు ఏదైనా ఒక దాని వివరాలు ఎంటర్ చేసి మన ఓటరు స్లిప్పును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఓటు వేసేటప్పుడు ఈ స్లిప్పుతో పాటుగా ఆధార్‌కార్డు, ఓటరు కార్డు సహా 12 రకాల గుర్తింపుకార్డుల్లో ఏదైనా ఒకటి చూపించాల్సి ఉంటుంది.

బూర నర్సయ్య.. ప్లాట్లను తిరిగివ్వాలి

ఆందోళనకు దిగిన యజమానులు

పెద్దఅంబర్‌పేట, మే 6: భువనగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ తమ ప్లాట్లు కబ్జా చేశారంటూ యజమానులు ఆందోళనకు దిగారు. సోమవారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని పసుమాముల గ్రామ రెవెన్యూ పరిధిలో ప్లాట్ల యజమానులు ఆందోళన చేపట్టారు. పసుమాములలోని 106/2 సర్వే నంబర్‌లో బూర నర్సయ్యగౌడ్ మరోకరితో కలిసి గతంలో కొంత భూమి కొనుగోలు చేశారని, దీని పక్కనే ఉన్న 87, 88 సర్వే నంబర్లలో 24 ప్లాట్లను కూడా వారు ఆధీనంలోకి తీసుకొన్నారని యజమానులు ఆరోపించారు. దీనిపై కోర్టుకు వెళ్లడంతో తమను పిలిపించి మాట్లాడారని తెలిపారు. 12 ప్లాట్లను తిరిగి ఇచ్చేస్తామని హామీ ఇచ్చారని, కానీ అప్పుడు.. ఇప్పుడూ అంటూ కాలం గడుపుతూ మోసం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. బూర నర్సయ్య గౌడ్ ఇప్పటికైనా తమకు ప్లాట్లు తిరిగిచ్చి మాట నిలబెట్టుకోవాలని కోరారు.

గాంధీభవన్‌లో పరస్పరం దాడులకు పాల్పడుతున్న కాంగ్రెస్ శ్రేణులు

కొట్టుకున్న కాంగ్రెసోళ్లు

గాంధీభవన్‌లో రసాభాస

కార్వాన్, మే 6: గాంధీభవన్‌లో సోమవారం నిర్వహించిన హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమావేశం రసాభాసగా జరిగింది. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి, ఏఐసీసీ కార్యదర్శి మన్సూర్‌అలీ పార్టీ అభ్యర్థి, నాయకులతో గాంధీభవన్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్వాన్ నియోజకవర్గానికి చెందిన ఓ నాయకుడు మాట్లాడేందుకు యత్నించగా వాగ్వాదం చోటు చేసుకున్నది. ఈ సమయంలో తోపులాట జరిగి స్వల్ప ఉద్రిక్తతకు దారి తీసింది. ఐతే కార్వాన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఉస్మాన్ బిన్ అల్ హజారీ తన కుమారుడిని వారించి అందరినీ సముదాయించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.

రేవంత్ సర్కార్ కరెంటు కాపలా!

నాలుగు రోజుల కిందట మహేశ్వరం నియోజకవర్గంలోని నందిహిల్స్ చౌరస్తాలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాత్రి వరకు జరిగిన ప్రచారంలో జనంతో పాటు స్థానిక విద్యుత్తు శాఖ సిబ్బంది సైతం అక్కడే ఉన్నారు. కారణం?! కరెంటు ఎప్పుడు పోతుందోనన్న ఆందోళన సాధారణ జనాన్ని మాత్రమే కాదు.. చివరకు విద్యుత్తుశాఖ అధికారులు, సిబ్బందిని సైతం వెంటాడుతున్నది. అందుకే కరెంటు పోగానే వెంటనే పునరుద్ధరించేందుకు నలుగురైదుగురు సిబ్బంది కాపలాగా ఉన్నారు. ‘పాపం.. పార్టీల సభకు పోలీసులు మాత్రమే ఉండేవాళ్లు. ఇప్పుడు కరెంటోళ్లు కూడా ఉంటున్నారు. ఎప్పుడు కరెంటు పోతుందో! కరెంటు పోతే ఎక్కడ మా ఉద్యోగం పోతుందో! అన్న భయంతో కరెంటోళ్లు తమ డ్యూటీ టైం ముగిసినా రాత్రి వరకు ఇక్కడే ఉన్నారు’ అని సబితా ఇంద్రారెడ్డి వ్యాఖ్యానించారు.

రెండు రోజుల కిందట మాజీ మంత్రి హరీశ్‌రావు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీట్‌ది ప్రెస్‌కు హాజరయ్యారు. కార్యక్రమం ముగిసిన వెంటనే బయటికొస్తుండగా ఆయనకు పోలీసులతో పాటు విద్యుత్తుశాఖ యంత్రాంగం కనిపించింది. ‘మేం ఉద్యమంలో ఉన్నపుడు మా వెంట పోలీసోళ్లు కనిపెట్టుకుని ఉండేవాళ్లు. ఇప్పుడేమో విద్యుత్తుశాఖ అధికారులు, సిబ్బంది కూడా ఉంటున్నారు. ఇదెక్కడి విచిత్రం’ అని హరీశ్‌రావు అన్నారు.

- కాంగ్రెస్ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా విచిత్ర పరిస్థితులు
- సభలు, రోడ్‌షోల దగ్గర విద్యుత్తు సిబ్బంది మోహరింపు
- పోలీసుశాఖకు దీటుగా ప్రచారంలో విద్యుత్తు శాఖ గస్తీ
- ఇప్పటికే పలు సభల్లో పవర్‌కట్‌తో సర్కారుకు తలవంపులు
- రాష్ట్రంలో కోతలు లేవంటూనే విద్యుత్తుశాఖకు తాఖీదులు

బడంగ్‌పేటలో కరెంట్ సమస్యలు తలెత్తకుండా కేటీఆర్ మీటింగ్ జరిగే ప్రాంతంలో వేచి ఉన్న విద్యుత్ సిబ్బంది

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మే 6 (నమస్తే తెలంగాణ): ప్రముఖులు పాల్గొనే సభల్లో సీఆర్పీఎఫ్, పోలీసులు, ఇతర భద్రతాసిబ్బంది పహారా కాస్తుంటారు. కానీ, విచిత్రంగా బీఆర్ఎస్ పాల్గొన్న సభల్లో కరెంటు అధికారులు కాపలా కాస్తున్నారు. ఎందుకంటే.. స్వయంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కరెంటు కోతల ప్రభావానికి గురవటం, మంత్రి సీతక్క సమావేశంలో కరెంటు పోవటం, మాజీ మంత్రి మల్లారెడ్డి మీటింగ్‌లో విద్యుత్తు కోతలు ఎదురవటం లాంటి అనేక ఘటనలను ‘నమస్తే తెలంగాణ’ ఫొటోలతో సహా ప్రముఖంగా ప్రచురించింది. కరెంటు కోతలే లేవని చెప్తామనుకున్న సీఎం, మంత్రులకు నమస్తే తెలంగాణ ఆధారాలతో సహా బయటపెట్టేసరికి ఏం మాట్లాడాలో అర్థం కావటం లేదు. దీంతో ఫొటోల వల్ల సమస్య వస్తున్నదని, కరెంటు పోతే వెంటనే సరిచేసేందుకు, ఫొటోలు తీసే అవకాశం ఇవ్వకుండా విద్యుత్తు సిబ్బందిని రంగంలోకి దించింది కాంగ్రెస్ సర్కారు. మొదట్లో ఎస్పీడీసీఎల్ సిబ్బందిని నేరుగా సభలు, రోడ్‌షోల వద్ద ఉంచగా, వాళ్ల ఐడెంటిటీ బయటపడుతున్నదన్న ఉద్దేశంతో వారిని సివిల్ డ్రెస్సుల్లో కాపలా ఉంచుతున్నది. మొత్తానికి కరెంటుకే కాపలా పెట్టడం కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లింది. ముఖ్యంగా కరెంటు సరఫరాలో అంతరాయాలు సాధారణంగా మారటంతో విద్యుత్తుశాఖ కాపలా బాధ్యతను భుజాన వేసుకొన్నది. పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా అన్ని రాజకీయ పార్టీలు ముమ్మరంగా ప్రచారాన్ని నిర్వహిస్తుండటంతో ఎక్కడ సభలు, సమావేశాలు, రోడ్‌షోలు జరిగినా అక్కడ పోలీసుశాఖ కంటే ముందుగానే విద్యుత్తు సిబ్బంది ప్రత్యక్షమవుతున్నారు. కార్యక్రమాలు ముగిసే వరకు కరెంటు పోకుండా చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరాయంగా, నాణ్యమైన కరెంటును ఇస్తామని చెప్తున్నా, క్షేత్రస్థాయిలో విద్యుత్తుశాఖ అధికారులు పడుతున్న పాట్లు చూస్తుంటే సర్కారు మాటలు నీటిమూటలేనని స్పష్టమవుతున్నది. వేసవిలో ఒకవైపు కరెంటు కోతలు, ఇంకోవైపు నీటి కొరత జనాన్ని వేధిస్తున్నాయి. కానీ ప్రభుత్వం మాత్రం అదేమీ లేదంటూ నిత్యం బుకాయిస్తున్నది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మొదలు.. కాంగ